# బానిసల బానిస

ఎవరికష్టాలతోనూ కన్నీళ్ళతోనూ బాధలతోనూ గాథలతోనూ సంబంధంలేనట్టూ నిశ్శబ్దంగా నిర్వికారంగా వుంది కోర్టు భవనం.

కోర్టు ఆవరణలోని కేంటీన్లోనూ చెట్లకింద గుమస్తాల షెడ్‌లోనూ రకరకాల కోర్టు పక్షులూ ప్లీడరు గుమస్తాలూ హడావిడిగా తిరుగుతూ మాట్లాడుకుంటున్నారు.

శ్రీమతి రాజ్యం రిక్షాదిగి కోర్టు ఆవరణలో నలుమూలలా చూసింది. ఓ చెట్టు క్రింద పార్టీలతో మాట్లాడుతూ కన్పించాడు గుమస్తా గుర్నాథం. అతడ్ని సమీపించిందో లేదో "వచ్చారా - వస్తారోలేదో అనుకున్నాం. ఇవాళ తీర్పు ఇచ్చేస్తారండి. ప్లీడరుగార్ని కలిశారా?" అడిగాడతడు.

తల అడ్డంగా వూపింది.

"ఇంకారాలేదండి. వచ్చేసే టైమయిందిలెండి కన్పిద్దురుగాని"

ఇంతలో సాక్ష్యాలవీరన్న "ఏవోఁయ్‌మనకేం పని చెప్పడంలేదు." అన్నాడొస్తూ గుర్నాథంతో. 'సాక్ష్యాల' అన్నది అతడి ఇంటిపేరు కాదు వృత్తిపేరు!

"క్రిమినల్ కేసులైతే నీకు చేతినిండా పనిద్దుం. మా కుర్రప్లీడరు దగ్గరకి క్రిమినల్ కేసులు రావట్లేదింకా."

"ఈ అమ్మాయి కేసేంటి?"

"వివాహం రద్దుచెయ్యమన్లే. సాక్ష్యం ఇస్తావేంటి?"

"ఓఁ చూదండమ్మాయిగారూ, ఏవైనా దొంగ సాక్ష్యాలివ్వాలంటే చెప్పండి. మీ వకీలు ఎలా చెప్పమంటే అలాగ ఒక్క అక్షరంముక్క బీరు పోకుండా చెబుతాను. కోర్టుక్కావాల్సింది సాక్ష్యాలూ, రుజువులేగాని నిజాలు కాదమ్మా"

"నీ సుత్తి అపుగానీ నీచేత సాక్ష్యం ఇప్పిస్తే నిన్నూ మమ్మల్నీ కూడా బొక్కలోవేస్తారు. ఈ అమ్మాయి తన భర్తని లెక్క చేసేది కాదంటూ ఈ కేసులో వాది తరపున సాక్ష్యం చెప్పింది నువ్వే మహానుభావా"

"చచ్చేం" నెత్తిమీద పైపంచె వేసుకుని వెళ్ళిపోయాడతడు గబగబా.

అతడెళ్ళినవైపే చూస్తోంటే, భర్తా అత్తగారూ మావగారూ వాళ్ళప్లీడర్తో కలిసొస్తూ కన్పించారు రాజ్యానికి.

ముఖం త్రిప్పుకుంది. కాని రెండు క్షణాలకే ఆమెభర్త రాజారావు కళ్ళముందు కొచ్చి నిలబడ్డాడు.

"నీ సామానంతా తెచ్చావా?"

"ఎందుకు?"

"ఎందుకేమిటి ఇవాళ తీర్పు ఇవ్వబోతున్నారు. నిన్ను నాతో కాపురం చెయ్యమని కోర్టు ఆదేశిస్తుందని మా ప్లీడరుగారు చెప్పేరు. జడ్జిగారి అభిప్రాయం సూచాయిగా ఆయనకి తెలిసిందట రెడీగా వుండు మరి. పరువుగా బ్రతికే మమ్మల్ని ఇదివరకు వీధికెక్కించావ్. ఇప్పుడు కోర్టుకీడ్చావ్. ఇంతకింతా నీకు ముట్టజెప్పకపోతే నేను మగాడ్నేకాదు" సవాలు విసిరి విసురుగా వెళ్ళిపోయాడు రాజారావు.

చిగురుటాకులా వణికిపోయింది రాజ్యం.

కళ్ళల్లో కన్నీటి బిందువులు మెరిసి గబుక్కున జారాయ్.

కళ్లూ బుగ్గలూ తుడుచుకుంది.

ఇప్పుడు కఠినుడిగా కర్కశంగా కన్పిస్తున్న తన భర్త పెళ్ళిచూపుల్లో ఎంత అమాయకంగా కన్పించాడు!

పెద్దల ఎడ అతడు చూపిన గౌరవం, ప్రదర్శించిన వినయం, ఆచితూచి మాట్లాడేపద్ధతి చూసి తన తల్లిదండ్రులెంతో మురిసిపోయారు. 'నువ్వదృష్టవంతురాలివే తల్లీ' అని ఆనందభాష్పాలు రాల్చారు.

నిశ్చయ తాంబూలాలు తీసుకున్నాక వెండిచెంబూ వెండిపళ్లెం ఇవ్వాలన్నారు, ఆడబడచు లాంఛనాల్లో స్టీలు సామాను పెడుతూ ఘనంగా జరిపించాలన్నారు. మధ్యవర్తిని పంపి పంతం నెగ్గించుకున్నారు.

"ఆ కుర్రాడైనా ఇది తప్పని చెప్పొద్దూ?" అని బంధుమిత్రులంటే "అతడేమనగలడు? చిన్నవాడాయె! పెద్దవాళ్ళ కుండాలి బుద్ధి" అని సమర్థించి అతనికి మాటరాకుండా చేశారు కూడా.

అతడి కాళ్ళు కడిగి కన్యాదానం చేసి తమకి సద్గతులు ప్రాప్తించబోతున్నందుకెంతో పొంగిపోయారు. అతడు అడిగిందానికన్నా ఎక్కువే పెట్టారు పండగలకీ, పబ్బాలకీ.

తనని కాపురానికిపంపుతూ - అప్పుచేసైతేనేం అన్ని రకాల సామాన్లనీ చీరెసారెల్నీ ఘనంగా పెట్టేరు.

అంతవరకూ తను కలల్లోనే విహరిస్తోంది. ఆయన తన కళ్ళకో మంచివాడిలా బుద్ధిమంతుడిలా కన్పిస్తూ వచ్చేడు. అతడు రాజు ఐతే తను రాణి అనుకుని పొంగిపోయేది.

కాపురానికెళ్ళేక స్వప్నాలకీ సంసారానికీ ఎక్కడా పొంతన వుండదన్నసంగతి తెలిసొచ్చింది.

ఇంటిపనీ వంటపనీ అంతా తనొక్కతే చెయ్యాలి. ఎక్కడేం తేడావచ్చినా "దొరసాన్లా చదువులు వెలగబెట్టిందికదూ ఇంతకంటే బాగా పనీపాటా ఎక్కడొస్తాయ్!" అని మూతీ చేతులూ తిప్పుతుంది.

"చదువుకున్న కోడలు కాపురం సరిగ్గా చెయ్యదండీ అని మొత్తుకుంటూనే వున్నాను. ఎవరైనా వింటేకదా!" అని ఓ వ్యాఖ్యానం విసుర్తుంది అత్తగారు.

అది విని ఈయనగారు తనమీద ఎగుర్తాడు. "నీకు తెలీకపోతే అమ్మనడిగి తెలుసుకోరాదా. తెలిసీ తెలీని పనులు చేసి అందర్నీ బాధపెడతావెందుకూ?" అనికోప్పడతాడు. ఆఖరికి కూరలో ఉప్పుతక్కువైనా అదేపాట!

ఇక మామగారు సరేసరి. నెలాఖర్రోజుల్లో ఎప్పుడైనా డబ్బు అవసరమై తనభర్త ఆయన్నడిగితే చుట్టకాల్చడం ఆపి మరీ ఉపన్యాసం ఇస్తాడు.

"కాళ్ళు కడిగి ఆ నీళ్ళు నెత్తిన జల్లుకున్న మావగారుండగా పెళ్ళానికి పూలుకొనాలి డబ్బు లిమ్మని నన్నడుగుతావేరా. వెళ్ళి మీ మావగార్నడుగు. పదులేం ఖర్మ వందలే ఇస్తాడు పువ్వుల్లో పెట్టి. నిన్నుచూసికాదు నీ పెళ్ళాం ముఖంచూసి" అని రెచ్చగొడతాడు.

దాంతో ఈయనగారు, "మా నాన్న అన్నదీ నిజమే. ఇన్నేళ్ళూ నన్ను పెంచి పోషించడమే గాక చదువులు చెప్పించారు. ఉద్యోగం వేయించారు. ఇంకా ఆయన్ని డబ్బులడగటం న్యాయంకాదు. అర్జంటుగా డబ్బు పంపమని మీ నాన్నకి వుత్తరం రాయి" అంటూ పీకలమీద కూర్చుంటాడు!

ఆయన మనస్సు మరీ గాయపడ్డప్పుడు తన ఒళ్ళో తలదాచుకునేదుస్తూ గుండెలోని బాధని వెళ్ళగ్రక్కేవాడు. ఆ మాటల సారాంశం బట్టి చూస్తే ఆయన్ని ఆఫీసులో కూడా ఎవరూ లక్ష్యపెట్టరు. ఎందుకూ పనికిరాని డిస్పాచ్ సెక్షన్లో పడేసి పదే పదే సలహాలి స్తూంటారు. ఆఫీసరు కూడా నువ్వు పనికిరాని వాడివీ మైల్డ్‌ఫెలోవీ అంటూ హీనంగా చూస్తూ కోప్పడుతూంటారు. ఇతరులముందు నోరువిప్పటం అలవాట్లేనందున అవతలివాళ్ళు మరింతగా స్వారీ చెయ్యడమూ ఈయన మౌనంగా భరించడమూ అలవాటు అయ్యాయి.

దానాదీనా ఆయన క్రొత్తరకం మనిషిలా తయారయ్యాడు. తను ఆఫీసులో మనిషిలా చూడబడాలంటే అందర్తోనూ కలిసి తిరగాలి. టీలు ఇప్పించాలి. పేకాట ఆడాలి అనుకున్నాడు. అలాగే చేశాడుకూడా. డబ్బు అవసరాలకి మావగారు కామధేనువులా కన్పించారు!

తన అత్తగారికి ఆడంబరాలెక్కువ. మావగారికి పెత్తనాలెక్కువ. ఇంటిఖర్చు ఎంతవుతోందో అప్పులెంతగా పెరిగిపోతున్నాయో ఎవరూపట్టించుకోరు. ఎవరికేం అవసరం వచ్చినా తనమీదే పడేవారు. "పుట్టింటికి ఉత్తరం రాయి" "పుట్టింటికెళ్ళి పట్రా..." అంటూ మంత్రాలు చదివేవారు పొగవేసి మరీ!

ఎన్నోసార్లు తెచ్చింది తను. కూతురి కాపురం బాగుంటే చాలని అప్పోసప్పో చేసి డబ్బు సర్దేవాడు తండ్రి గుండెల్లో గుండెలు పగిలేలా ఏడుస్తూనే!

కానీ వీళ్ళ దాహం అంతకంతకీ అధికమైపోయింది. దాహంవేసిన వాడికి త్రాగమని నెయ్యి ఇచ్చినట్లయ్యింది!

ఇంటి మీద చేసిన అప్పు తడిసి మోపుడయ్యిందనీ వెంటనే అప్పు తీర్చకపోతే ఇల్లు వేలం వేయిస్తానంటూ రంకెలేసి పోయాడు మార్వాడి. అతడి ముందు కుక్కిన పేనుల్లా వున్న అత్తగారూ మావగారూ ఆఖరికి కట్టుకున్న భర్త కూడా తనమీద పడి శివాలు తొక్కారు.

"మీనాన్న నీకు కట్నంగా ఇచ్చిన భూమి అమ్ముకురా" అని పుట్టింటికి పంపేశారు. అమ్ముకొచ్చి రూపాయలు వారిచేతిలో పోసింది.

కొన్నాళ్ళెంతో మర్యాదగా చూశారు. మళ్ళీ మామూలే. ఈసారి మరో అవతారం. ఎత్తేరు.

"మీ నాన్న నీకు కట్నం తక్కువిచ్చాడు. అంచేత ఒక అరెకరం తోట రాయమను. లేకపోతే నిన్ను మావాడు వదిలేస్తాడు. వాడికి వేరే సంబంధం చేస్తాం " అని తెగేసి చెప్పేరు. భర్త వత్తాసు పలికాడు.

పుట్టింటికి పరుగెత్తింది పుట్టెడు దుఃఖంతో. తను నోరు తెరిచి చెప్పలేక పోయిందిగాని కన్నీళ్ళు కథనంతా విన్పించాయి. పెద్ద మనుషులొచ్చి రాజీచేశారు - అయిదువేలిప్పించి!

ఈ అతుకుల గతుకు సంసారపురోడ్డు మీది ప్రయాణంలో తనకి రెండుసార్లు అబార్షనయ్యింది. ఆరోగ్యం దెబ్బతింది. నీరసంగా తయారయ్యింది. అయినా పని తప్పలేదు!

డబ్బు అవసరాలెక్కువవడంతో వాళ్ళ పుర్రెల్లో కొత్తపురుగు పుట్టింది. తనని ఎలా వోలా వదిలించుకుంటే వేరేపెళ్ళి చేస్తే ముప్ఫైవేల కట్నం వస్తుందన్న ఆశ వాళ్ళని లోబరుచుకుంది. రాక్షసుల్ని చేసింది.

రోజూ మాటల్తో చేతల్తో మానసికంగా శారీరకంగా కూడా చిత్రవధ చేశారు!

ఓ రోజున తనమీద కిరసనాయిలు పోసి అగ్గిగీచారు. తను కేకలు పెడుతూ క్రిందపడి దొర్లేసింది. జనం పోగవడంతో కొన్ని బొబ్బల్తో ప్రాణ గండంనుండి బయటపడింది.

సరిగ్గా అప్పుడే నాన్న వచ్చేరు. ఆయన గుండెల మీదవాలి బావురుమంది!

ఓదార్చి, "నువ్వు వీళ్ళకి భారమేమోగాని మాక్కాదమ్మా రామ్మా" అంటూ పుట్టింటికి తీసుకుపోయారు.

అక్కడా సుఖంగా శాంతిగా వుండలేకపోయింది. మొదట సానుభూతి చూపినవాళ్ళే తర్వాత్తర్వాత నిందించారు. మొగుడేదో కొడితే గోరంతలు కొండంతలు చేసుకొచ్చేసిందనీ కాపురాన్ని కాలదన్ని వచ్చేసిందనీ మొగుడ్నొదిలేసిందనీ ఎన్నెన్నో మాటలు - ఈటెలు!

చదివినచదువూ నాన్న పలుకుబడీ ఉద్యోగం చూపెడితే పట్నం వచ్చేసింది. గుండెగాయాన్ని మాన్పుకుంటూ మూడేళ్ళు గడిచేక ప్రమోషన్ కూడా తెచ్చుకున్నాక కోర్టునుంచి సమన్లొచ్చాయ్ తనకి!

తనని భార్య వదిలేసి వెళ్ళిపోయిందనీ తమ కాపురాన్ని పునరుద్ధరించమనీ తాము మళ్ళీ భార్యా భర్తల్లా కలిసి జీవించేలా కోర్టు అనుమతించాలనీ అర్థిస్తూ కోర్టుకెక్కాడాయన!

అతడికేవో వివాహ ప్రయత్నాలు చేస్తున్నారనీ సంబంధాలెక్కడంలేదనీ విన్నదిదివరకు. ఇప్పుడీ గొడవచూసి వాళ్ళ మనస్సులు మారాయని భ్రమ పళ్ళేదు. తన సంపాదనమీద వాళ్ళ కన్ను పడిందని గ్రహించి మంచి ప్లీడర్ని పెట్టుకుంది.

అతడితో కలిసి కాపురం చెయ్యడం తనకే మాత్రం ఇష్టం లేనందున తమ వివాహాన్ని రద్దు చెయ్యమని కోర్టువారిని కోరింది. అంతేగాకుండా భార్యాభర్తలలో ఎవరో ఒకరు న్యాయమైన కారణం లేకుండా వేరొకరిని విడిచి దూరంగా వుంటే దీనివల్ల బాధ కలిగినవారికి మరల కలిసి జీవించే హక్కువున్నదని చెప్పే హిందూ వివాహచట్టంలోని తొమ్మిదవ సెక్షన్ చెల్లనేరదని తన వాదన.

యువ లాయర్ జగన్నాథ్ తన కేసుని ఛాలెంజీగా తీసుకున్నాడు.

తనంతట తానే సరైన కారణం లేకుండా భర్తని విడిచివచ్చేసిందని ఋజువు చెయ్యడానికి వాళ్ళెన్ని ఎత్తులు వేసినా వాటిని చిత్తుచేశాడు. తను పడ్డ మానసిక శారీరక

వేదననీ అనుభవించిన కష్టాల్నీ కోర్టువారికి విన్నవించాడు. హిందూ వివాహచట్టంలోని తొమ్మిదవ సెక్షన్ చెల్లదని తీర్పిచ్చి వివాహానికి బలైపోయి, వివాహం పేరుతో కష్టాల్నీ కన్నీళ్ళనీ భరిస్తూ భర్తకు బానిసలాగా బ్రతికే స్త్రీకి విముక్తి ప్రసాదించాలని కోర్టువారినర్థించాడు.

తన భవిష్యత్తేం కానున్నదో ఇంకొన్ని గంటల్లో న్యాయమూర్తి తీర్పు ఇవ్వబోతున్నారు!

"మిమ్మల్నేనండి. ఏమిటాలోచిస్తున్నారు?" గుర్నాథం అడిగాడు.

ఉలిక్కిపడి చూసి "సారీ" అంది.

"కేసు గురించా? మీ ఆయన మాటలకా? మీరేం దిగులుపడకండి. గెలుపు మనదే. తీర్పు వెలువడే వరకూ ప్రతి ప్లీడరూ తమ పార్టీల్తో అలాగే చెబుతారండి. అయినా మన కేసులో బలముంది. మా ప్లీడరు బాగా వాదించారు.. అరుగో వచ్చేరు.."

స్కూటర్ మీదొచ్చిన జగన్నాథ్ వంక విస్ఫారిత నేత్రాలతో కృతజ్ఞతా పూర్వకంగా చూసింది రాజ్యం.

"మీరు లోపలికెళ్ళి కూర్చోండి. తీర్పు ఎలావున్నా మీరేం అప్‌సెట్ కాకండి..."

"వాళ్ళు గెలిస్తే ఇప్పుడే బలవంతంగా తీసుకుపోతామంటున్నారండి"

"ఏడిశారు. మనకి అప్పీలు చేసుకోటానికి టైమిస్తారు. సాధ్యమైనంత వరకూ గెలిచితీరుతాం. కాని ఇదో ప్రత్యేకతరహా కేసు గనుక ఇక్కడ గెలవలేక పోయినా అప్పీల్లో గెలిచి తీరతాం. నా స్వంత ఖర్చు మీద అప్పీలు చేసి గెలిపిస్తాను. సరేనా?"

తలూపి కోర్టు హాల్లో కెళ్ళి కూర్చుంది రాజ్యం.

ఆమెకి మరోవైపున రాజారావూ అతడి తల్లిదండ్రులూ కూర్చునున్నారు. ఆమెని చూడగానే అత్తగారు మెటికలు విరిస్తే మావగారు మీసం దువ్వారు.

చూపులు మరల్చి సర్దుకుని కూర్చుందామె అంతమందిలో వున్నా ఒంటరిగా ఫీలవుతూ.

కొన్ని కేసులు చూశాక న్యాయమూర్తి రాజారావు కేసు టేకప్ చేశారు.

కేసు పూర్వాపరాలు విచారించేక న్యాయమూర్తి ఇలా తీర్పిచ్చారు.

"... ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యక్తుల సాంఘిక జీవనాన్ని శాసించే అధికారం కోర్టుకిగాని ప్రభుత్వానికిగాని లేవు. దాంపత్య జీవితంలో బలవంతానికీ రాక్షసరతికీ స్థానంలేదు. ఇష్టంలేని దాంపత్య జీవితంవల్ల దంపతులు సుఖసంతోషాలు పొందలేరు.

పైగా మానసిక క్షోభకీ అశాంతికీ లోనవుతారు. గనుక వాది పిటీషన్‌ను త్రోసిపుచ్చుతున్నాను. వివాహబంధం స్త్రీ పాలిట జైలు కాకూడదు. ఆడది బానిసలబానిస అన్నారు మహాకవి సుబ్రహ్మణ్యభారతి ఎన్నో ఏళ్ళక్రితం. నేటికీ ఆ పరిస్థితి మారకపోవడం దారుణం. భర్తకి భార్యని బానిస చేసే హిందూ వివాహచట్టంలోని తొమ్మిదవసెక్షన్ చెల్లదని తీర్పు ఇస్తున్నాను..."

నలువైపుల్నుంచీ తప్పట్లు మ్రోగాయ్.

చారిత్రాత్మకమైన తీర్పునిచ్చి తనఛాంబర్‌లోకి న్యాయమూర్తి నిష్క్రమించగానే లాయర్ జగన్నాథ్‌ని అభినందనల్తో ముంచెత్త సాగారంతా.

రాజ్యానికి పట్టరానంత ఆనందంగావుంది. తనమీద తనకెంతో నమ్మకం కలిగింది. ధైర్యం పెరిగింది. ఆడదానికి జరుగుతోన్న అన్యాయాన్నెదిరించడంలో తను ఒంటరిదికాదన్న భావం అమెకి క్రొత్త ఉత్సాహం తెచ్చిపెట్టింది.

ఠీవిగా కించిత్తు గర్వంగా రాజారావువాళ్ళ వైపు చూసింది.

తీర్పు ఏమనిచ్చారో ఏవిటో అర్థంగాక అర్థమైనదాన్ని జీర్ణించుకోలేక అయోమయంగా దిక్కులు చూశారు, రాజ్యాన్నీ తప్పట్లు కొడుతోన్న జనాన్నీ చూసి మెల్లగా జారుకున్నారు ఏడుపు ముఖాల్తో.

ఇంతవరకూ తన గుండెనావరించిన రకరకాల భయాలన్నీ పటాపంచలైపోగా గుండెల్నిండా ఆత్మవిశ్వాసం నింపుకునిముందడగు వేసింది కుమారి రాజ్యం - తనిప్పుడొకరి రాజ్యంకాదు - స్వరాజ్యం అనుకుంటూ.

ఠీవిగా మహోన్నతంగా నిలబడి వున్న కోర్టు భవనంపైన త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడుతోంది!

(స్వాతి సపరి వారపత్రిక)

**7.12.1984**

కథా నిలయం
శ్రీకాకుళం